క్లుప్తంగా

మంత్రికి సన్మానం



నర్సంపేట : తెలంగాణ సంక్షేమ సంబరాల్లో హాజరయ్యేందుకు నర్సంపేట వచ్చిన మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి నేతృత్వంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మొక్క బహూకరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్రె రాధ, బత్తిని శిరీశ, నాయకులు వి.కస్తూరి, పి.సుధ, మల్లికాంబ, ఎస్తర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థినికి గర్భం

నర్సంపేట రూరల్ : ఫోన్ ద్వారా మొదలైన పరిచయం ప్రేమగా మారి చివరకు డిగ్రీ విద్యార్థిని గర్భం దాల్చిన పరిస్థితికి దారి తీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నెక్కొండ మండలంలోని ఓ తండాకు చెందిన యువతి నర్సంపేటలోని హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు ములుగు జిల్లా కేంద్రానికి చెందిన యువకుడితో ఫోన్‌లో ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారి గర్భం దాల్చడంతో బయటకు పొక్కింది. దీంతో విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. నర్సంపేట ఎస్సైని వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు.

చెరువు మట్టి తరలింపుపై ఆర్డీఓకు ఫిర్యాదు

సంగెం : మండలంలోని పల్లారుగూడ గ్రామ చెరువులోని రేగడి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు కృష్ణ, స్రవంతి, ఆనందం తదితరులు వరంగల్ ఆర్డీఓ మహేందర్‌జీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. సర్పంచ్ కెక్కర్ల కుమారస్వామి, ఉపసర్పంచ్ కోడూరి రఘు, కోఆప్షన్ సభ్యుడు బొమ్మ కోటేశం, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు సింగారపు వేణు, వార్డు సభ్యులు గుర్రం గీత, మొహియొద్దీన్, బొంత శివకోటి, నీరటి వాటదారు బొమ్మల స్వామి కలిసి ఊర చెరువు 363 సర్వే నంబర్‌లోని 98 ఎకరాల భూమిలోని మట్టిని ఇటుకల బట్టీ వ్యాపారి వెంకటేశ్వర్లుకు రూ.50 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



నల్లబెల్లి : ఓ వృద్ధుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని బొల్లోనిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై నైనాల నగేష్ కథనం ప్రకారం.. బొల్లోనిపల్లికి చెందిన భూమ సమ్మయ్య (70)ను ఏప్రిల్ 29న అతడి తమ్ముడు సారసమ్మయ్య కుటుంబ సభ్యులు దూషిస్తూ చేతిలోని కర్రతో నెట్టేయడంతో అతడు కిందపడిపోగా తొంటి భాగంలో బలమైన దెబ్బ తగలడంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. ఈనెల 7న ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ అయ్యి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు 8న (గురువారం) రాత్రి మృతి చెందాడు. సమ్మయ్య మృతిపై అనుమానం ఉందని అతడి భార్య సరోజన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

చెన్నారావుపేట : ద్విచక్ర వాహనాన్ని బొలేరో ఢీకొట్టిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రామన్నకుంట తండా సమీపంలో నెక్కొండ నుంచి నర్సంపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న అమ్మ కట్టయ్య, రోరె రవిలను నర్సంపేట నుంచి నెక్కొండకు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. కట్టయ్యకు గాయాలు కాగా నర్సంపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు బొలేరో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టీపీఆర్ఎస్ జిల్లా కార్యదర్శిగా భరత్



గీసుకొండ : 15వ డివిజన్ రెడ్డిపాలెంకు చెందిన మచ్చ భరత్ టీపీఆర్ఎస్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షులు సింగారం ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతినిధులకు భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి సిద్ధం

- వాటా ధనం చెల్లించడానికి గొల్ల, కురుమలు సిద్ధం

పర్వతగిరి : గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమౌతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గొల్ల, కురుమలకు రెండో విడత కింద 768 గొర్రెలను పంపిణీ చేయనున్నారు. మొదటి విడతలో 740 యూనిట్లు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. రెండో విడత కోసం లబ్ధిదారులు వాటా ధనం రూ.43 వేల 500లు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు.



మొదటి విడతలో వడ్లకొండలో గొర్రెలు పంపిణీ చేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎంపీ పసునూరి దయాకర్ (ఫైల్)

రెండో విడతలో అవకాశం కల్పించాలి



మొదటి విడతలో నాకు గొర్రెలు పంపిణీ చేయలేదు. వాటాధనం చెల్లించడానికి సిద్దంగా ఉన్నా. నాకు రెండో విడతలో గొర్రెలు పంపిణీ చేస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

-సాంబయ్య లబ్ధిదారుడు, పర్వతగిరి

768 యూనిట్లు టార్గెట్



మొదటి విడతలో 740 యూనిట్లను పంపిణీ చేశాం. రెండో విడతలో 768 యూనిట్లు టార్గెట్‌గా పెట్టుకున్నాం. ప్రభుత్వానికి నివేదిక అందించాము. నివేదిక ప్రకారం అన్ని గ్రామాలకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. లబ్ధిదారులు వాటా ధనాన్ని సకాలంలో చెల్లించాలని సూచించాము.

-డాక్టర్ నరేష్, పశువైద్యాధికారి

రెండో విడతలో పంపిణీ చేయనున్న గ్రామాలు

గ్రామం	యూనిట్లు
అనంతారం	13
అన్నారం షరీఫ్	16
చౌటపల్లి	58
దౌలత్‌నగర్	57
ఏనుగల్	87
గోపనపల్లి	36
జమాల్‌పురం	39
కల్లెడ	81
కొంకపాక	53
బూర్గుమల్ల	37
పర్వతగిరి	84
రావూరు	22
సోమారం	20
నారాయణపురం	15
చింతనెక్కొండ	108
వడ్లకొండ	42
మొత్తం	768

పాలిసెట్ రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు సన్మానం



విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న తరుణి సంస్థ సిబ్బంది

సంగెం : పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన తరుణి సంస్థ విద్యార్థినులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో తరుణి ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో 25 రోజుల పాటు 70 మంది విద్యార్థినులకు ఉచిత కోచింగ్ ఇచ్చారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో స్రావ్య రాష్ట్రస్థాయిలో 75వ ర్యాంకు సాధించింది. మరో 8 మంది బాలికలు ర్యాంకులు సాధించారు. వారికి శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయి, ఉత్తమ ర్యాంకులు సాధించం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రణదీర్, ఫ్యాకల్టీ పురుషోత్తం, మానస, క్లస్టర్ కోఆర్డినేటర్లు భవానీ, రామంజని, మౌనిక, జ్యోతి, వాలంటీర్లు సుకన్య, ప్రియాంక, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకట్రాంరెడ్డి

గీసుకొండ : జిల్లాలోని గీసుకొండ–సంగెం పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలని టీపీసీసీ సభ్యుడు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, ఎకరానికి వంద గజాల స్థలం ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదన్నారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ అధికారులను అడిగితే దాటవేస్తున్నారని చెప్పారు. 22 కంపెనీలు యూనిట్లను ఏర్పాటు చేయడానికి ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కాగా ఇప్పటివరకు 4 కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. పార్క్ ప్రాంతంలో వేస్తున్న రోడ్లు, డ్రైనేజీ కల్వర్టు తదితర పనుల కోసం ప్రభుత్వానికి సెస్ చెల్లించకుండానే ఎస్సారెస్పీ కాల్వ నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని, అన్ని పనులను టెండర్ల ద్వారా ఒక్కరే కైవసం చేసుకున్నారని వివరించారు. ఈ విషయమై విచారణ జరిపించాలని, గణేశా కంపెనీ పెట్ వాటర్ బాటిళ్ల తయారీ ప్రక్రియలో పర్యావరణం దెబ్బతిని భూగర్భజలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, కైటెక్స్ కంపెనీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

‘ముదిరాజ్’లను ఆర్థిక సాయం జాబితాలో చేర్చాలి

ఖానాపురం : బీఆర్ఎస్ ప్రభుత్వం చేతి వృత్తిదారులకు అందజేయనున్న రూ.లక్ష ఆర్థికసాయం జాబితాలో ముదిరాజ్ కులస్తులను చేర్చాలని ముదిరాజ్ విద్యార్థి వేదిక జిల్లా అధ్యక్షుడు మొలకల మురారి కోరారు. ఈ మేరకు ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్ కులస్తులను చేర్చకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

సంగెం : మండలంలోని కుంటపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి, మైసమ్మ తల్లి దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా సాగుతోంది. బ్రహ్మశ్రీ అప్పె నాగేశ్వర శర్మ, నాగార్జున శర్మ శుక్రవారం ఉదయం అవాహిత దేవతా పూజ, హవనం, అమ్మవారి హోమం, హారతి మంత్ర పుష్పం, సాయంత్రం మహిళలచే కుంకుమార్చాన, అనంతరం ధన్యా దివాసం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ,పాల్గొన్నారు.

కొనసాగిన ఉత్సవాలు



పూజ చేస్తున్న భక్తులు

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటలో రామాలయ, శివాలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వెన్ను శృతి పూర్ణచందర్‌తోపాటు మరో 20 మంది దంపతులు వాస్తుహోమ పూజల్లో పాల్గొన్నారు. శనివారం ధ్వజస్తంభన ప్రతిష్ఠాపన, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్చాలి



పర్వతగిరి : కార్యక్రమంలో ఎంఈఓ, టీచర్లు



రాయపర్తిలో..

పర్వతగిరి : పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్చాలని ఎంఈఓ చదువుల సత్యనారాయణరావు ప్రజలను కోరారు. మండలంలోని గోపనపల్లి, అనంతారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అలాగే పర్వతగిరి స్కూల్ హెచ్ఎం జలీల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. పలువురు విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. గోపనపల్లిలో చేపట్టిన ‘మన ఊరు–మన బడి’ పనులను సమీక్షించి మాట్లాడారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్, సాల్కర్‌షిప్, డిజిటల్ తరగతులు తదితర పథకాలను లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో గోపనపల్లి హైస్కూల్ హెచ్ఎం లింగమూర్తి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పూర్ణచందర్, సర్పంచ్‌లు పంజా మహేష్, తాటి దేవేందర్, ఎంపీటీసీ సూర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని పలు వీధుల్లో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్ఎం రావుల భాస్కర్‌రావు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాదె ప్రవీణ్‌రెడ్డి, శివపురం వీరభద్రశర్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రేతలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : నర్సంపేట డివిజన్‌లో నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఏటా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు సీజన్ ప్రారంభంలో సీడ్స్ దుకాణాల్లో నామమాత్రంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు. విత్తనాల పట్ల రైతులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నర్సంపేట ప్రాంతంలో రైతులు ఏటా మొక్కజొన్న, పత్తి, మిరప, వరి లాంటి నకిలీ విత్తనాలతో నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తన వ్యాపారులతో కుమ్మక్కై దళారీ పాత్ర పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. సీజన్ ప్రారంభంలోనే విత్తనాల కొరతను సృష్టిస్తూ అధిక ధరలకు అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి నకిలీ విత్తనాలను అరికట్టడంతోపాటు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఈరెల్లి రాంచందర్, భూమా అశోక్, బర్ల గౌరయ్య, అజ్మీర శివరాం, పూల్‌సింగ్, ఎలకంటి కుమారస్వామి, కడారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

‘వెంచర్‌కు అనుమతులు లేవు’



ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పంచాయతీ అధికారులు

చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం శివారులోని లోలెవల్ కాజ్‌వే పక్కన ఏర్పాటు చేసిన వెంచర్‌కు అనుమతులు లేవని నర్సంపేట ఎంపీఓ సునిల్ కుమార్ రాజ్ తెలిపారు. ఈ మేరకు వెంచర్‌లో నోటీస్ ఫ్లెక్సీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ భూమిని కొన్నవారు నష్టపోతారని, తాము తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని పేర్కొన్నారు. అనుమతులు లేని భూమిని కొనుగోలు చేసి నష్టపోవద్దని చెప్పారు. మళ్లీ అమ్మకానికి పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంశొద్దీన్, సిబ్బంది కుమార్, ఐలుమల్లు, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడిన లారీ

నర్సంపేట రూరల్ : ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి లారీ బోల్తా పడిన ఘటన నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి నర్సంపేట వైపు వస్తున్న లారీ మహేశ్వరం శివారులో అదుపు తప్పి వ్యవసాయ భూముల్లోకి దూసుకెళ్లి విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణప్రాణం వాటిల్లలేదు. లారీ ఢీకొట్టడంతో మూడు విద్యుత్ స్థంబాలు విరిగాయి. విద్యుత్ శాఖకు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

పదోన్నతులతో మరింత బాధ్యత



వీడ్కోలు పలుకుతున్న వైద్యాధికారి, సిబ్బంది

నెక్కొండ : పదోన్నతులతో ఉద్యోగులకు విధుల్లో మరింత బాధ్యత పెరుగుతుందని అలంకానిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆ పీహెచ్‌సీలో ఇటీవల పదోన్నతులు పొందిన ఏఎన్ఎంలకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంలు యాదమ్మ రాయపర్తికి, అరుణకుమారి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి సూపర్‌వైజర్లుగా పదోన్నతితో బదిలీ అయ్యారని తెలిపారు. అనంతరం ఏఎన్ఎంలను శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సునీత, సూపర్‌వైజర్ రాజు, ఫార్మసిస్ట్ శ్రీనివాసాచారి, సిబ్బంది వినోద, సుజాత, ప్రభ, కరుణ, దివ్య, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వర్ధన్నపేట : మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు కోమాండ్ల బాబురెడ్డి (68) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే అరూరి రమేశ్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాబురెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే అరూరి రమేశ్ బాధితులను పాల్గొని ఓదార్చారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ) కార్యాలయంలో ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను ఎంపీపీ బాదావత్ విజేందర్, ఎంఈఓ రత్నమాల, మండల నోడల్ ఆఫీసర్ మోహన్‌రావు శుక్రవారం పంపిణీ చేశారు. సంబంధిత పాఠశాలలకు పంపించి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంప్లెక్స్ స్కూల్ హెచ్ఎం రజిని, పర్వత రమణారావు, సూపరిండెంటెంట్ దయాకర్‌రావు, సీఆర్పీలు సంపత్, స్వామి, బాలు, శిల్ప, హేమలత, యాదగిరి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

- వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో బాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సంక్షేమ సంబురాలకు సర్పంచ్ కందగట్ల రవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా గండ్ర జ్యోతి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పడక ముందు ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఎవరూ అడగకపోయినా రైతుబంధు, దళితబంధు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, తదితర పథకాలు అమలు చేస్తూ పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని తెలిపారు. సామాజిక పింఛన్లు భారీగా పెంచి అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం 88 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి ,16 మందికి మంజూరైన సీఎం కేసీఆర్ చెక్కులను ఆమె పంపిణి చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్, తహసీల్దార్ చలమల్ల రాజు, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ఎంపీపీ రాంశెట్టి లత లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడి మృతి



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి (ఆర్ఎస్ఎస్) మండల అధ్యక్షుడు బొమ్మినేని మాధవరెడ్డి(58) గుండెపోటుకు గురై శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సాయంత్రం గుండెలో నొప్పి రావడంతో ఆయన్ను కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన గతంలో టీడీపీ మండల నాయకుడిగా, అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడిగా పని చేశాడు. కొంతకాలంగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉంటున్నాడు. ఆయన మృతితో మండలంలో విషాదం నెలకొంది. మాధవరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు వీరగోని రాజ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, సర్పంచ్ జయపాల్‌రెడ్డి, వీరాటి రవీందర్‌రెడ్డి సంతాపం తెలిపారు. మాధవరెడ్డి కుటుంబాన్ని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పరామర్శించారు. మాధవరెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే ధర్మారెడ్డి హాజరు కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

‘సీఎం తీరుతో బీసీల్లో చిచ్చు’

నెక్కొండ : కులవృత్తులకు రూ.లక్ష సాయం పేరుతో సీఎం కేసీఆర్ బీసీల్లో చిచ్చు పెడుతున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇప్పటివరకు బీసీలకు రుణాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రుణాలు అందక తొమ్మిదేళ్లలో ప్రైవేటుగా అప్పులు చేశారని తెలిపారు. కేవలం 15 కులాలకు మాత్రమే సాయం వర్తింపు చేయడం సరికాదన్నారు. మిగితా కులాలను విస్మరించడం దారుణమన్నారు. కేవలం 20 శాతం లోపున్న వారికి పథకం వర్తింపచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీలందరికీ రూ.లక్ష పథకాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆకఃఓవఃనూ బీసీ కులాల తిరుగుబాటు తప్పదని అజయ్‌కుమార్ హెచ్చరించారు.